క్లుప్తంగా

సర్టిఫికెట్ల అందజేత



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

కొత్తపల్లి: అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ సెజ్ ప్రాంతంలో కుట్టు మెషీన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సంస్థ ప్రతినిధులు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతిభా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 54 మంది మహిళలకు జనరల్ మేనేజర్ సాంబశివరావు, ఏపీఎం శ్రీధర్‌ల చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.30 వేల విరాళం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో జరుగుతున్న శ్రీభీమేశ్వర అన్నదాన ట్రస్టుకు సామర్లకోటకు చెందిన చుక్క మోహన్‌సాయి కృష్ణ రూ.30 వేల విరాళం ఇచ్చినట్లు ఈఓ భళ్ల నీలకంఠం సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాని కి వచ్చిన ఆయన స్వామి,అమ్మవారి దర్శించుకొని ఆలయంలో జరుగుతున్న అన్నదానాన్ని పరిశీలించి విరాళం ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు ఆలయ పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సరిత



ఫీవర్ సర్వేలో ప్రజలకు జాగ్రత్తలు వివరిస్తున్న సరిత

పెద్దాపురం: ప్రజలు ఆరోగ్యంపై మరింత అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పి.సరిత అన్నారు. మలేరియా వారోత్సవాల్లో భాగంగా పెద్దాపురం అర్బన్ ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బందితో కలిసి సోమవారం ఇంటింటికీవెళ్లి ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు, సలహాలిచ్చారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఫీవర్ సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూషరాయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ గ్రీవెన్సులో పది అర్జీలు



సామర్లకోట గ్రీవెన్సులో అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామారావు

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జాస్తి రామారావు ఆధ్వర్యంలో నిర్వహిం చిన గ్రీవెన్సులో పది అర్జీలు వచ్చాయి. మున్సిపాలిటీ పరిధిలో సమస్యలు పరిష్కరించడానికి ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నారు. దీనిలో మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు, పారిశుద్ధ్యం వంటి వివిధ సమస్యలపై అర్జీలు వచ్చాయని కమిషనర్ తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కారం అయ్యేలా చేస్తామని చెప్పారు. మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత, మున్సిపల్ డీఈ ఎ.అనంతలక్ష్మి, మేనేజరు అచ్చుతరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల అందజేత

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు, స్థానిక పద్మనాభ కాలని మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్టూడెంట్ కిట్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెంకే సత్యవతి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, మున్సిపల్ కమిషనర్ పద్మావతి, ఎంపీడీఓ ఉషా రాణి, విద్యా శాఖాధికారులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లో పెరిగిన మట్టి

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేట నుంచి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మట్టి పేరుకుపోవడంతో వర్షపునీరు డ్రైన్లలోనికి వెళ్లకుండా రోడ్డుపై నిలిచిపోతుంది. ఈ మేరకు మానవహక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ రోడ్డు మార్జిన్‌లో పెరిగిపోయిన మట్టిని తొలగించి స్థానికుల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

రాజుల రాజ్యంలో దొంగలు పడ్డారు

- పిఠాపురంలో హల్‌చల్ చేస్తున్న దొంగలు
- సెల్‌ఫోన్లు, బంగారు నగలు, మోటారు సైకిళ్ల చోరీ
- వరుస దొంగతనాలతో భయపడుతున్న పట్టణ ప్రజలు



గొల్లప్రోలు వినాయక ఆలయంలో చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీసులు



పిఠాపురం పట్టణం

పిఠాపురం: ఒకప్పుడు రాజుల ఏలుబడిలో పేరొందిన పీఠికాపురంలో ప్రస్తుతం దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. భారతదేశంలోని 18 శక్తి పీఠాల్లో ఒకటిగా పరిగణించబడే పిఠాపురం ఆధ్యాత్మికంగాను పేరొందిన పట్టణం కావడంతో నిత్యం జనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇదే అదనుగా ఎక్కడెక్కడి నుంచో వచ్చిన చోరులు ఇక్కడ తిష్ట వేసి తమ చోర నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. జేబులో పెట్టుకున్న సెల్‌ఫోన్లు, మెడలో బంగారు గొలుసులు, గుడిలో అమ్మవారి చెవి దుద్దులు, ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు.. కాదేదీ దొంగతనానికి అనర్హమంటూ చోరులు రెచ్చిపోతున్నారు. పట్టపగలు అందరూ చూస్తుండగానే చేతిలో సెల్‌ఫోన్లు లాక్కుని పోతున్న ఘటనలు, ద్విచక్ర వాహనాల దొంగతనాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం వల్లే దొంగలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇలాంటి ఘటనలు కోకొల్లలు

- గత సోమవారం పిఠాపురం రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్న కనకదుర్గ గుడిలో జరిగిన చోరీ స్థానికంగా కలకలం రేపింది. గుర్తు తెలియని వ్యక్తి గుడిలోకి ప్రవేశించి అమ్మవారి చెవి దిద్దులు, అమ్మవారి బొట్టు, రెండు జతల మంగళ సూత్రాలు, సుమారు 17 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. చోరీ ఎలా జరిగిందో అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డైంది.
- నెల రోజుల క్రితం స్థానిక స్టేట్ బ్యాంకులో ఒక ధాన్యం వ్యాపారి రూ.6 లక్షలు డ్రా చేసుకుని తీసుకెళుతుండగా ఒక వ్యక్తి వచ్చి మీ బ్యాగులోంచి డబ్బులు పడిపోయాయంటూ రూ.50 నోటు చూపించాడు. దీంతో సదరు వ్యాపారి కింద పడి ఉన్న నోటును తీయబోతుండగా ఆ గుర్తు తెలియని వ్యక్తి అతడి చేతిలోని బ్యాగుని పట్టుకుని పారిపోయాడు.
- రెండు రోజుల క్రితం పిఠాపురం ఆంధ్రా బ్యాంకు వద్ద బండిపై నిలుచుని ఉన్న ఒక విలేకరి వద్దకు వచ్చిన ఆగంతకుడు ఉప్పాడ బస్టాండ్ ఎటువైపు అని అడగ్గా ఆయన దారి చూపించాడు. విలేకరి ఏం జరుగుతుందో తెలుసుకునేలోపు దుండగుడు ఆయన జేబులో సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయాడు.
- వారం క్రితం ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో తన వారి కోసం ఎదురు చూస్తున్న ఒక వ్యక్తి వద్దకు వచ్చిన ఆగంతకుడు మీది గొల్లప్రోలే కదా అంటూ మాటలు కలిపాడు. తనది కూడా ఆ ఊరేనని అటుగానే వెళుతున్నానంటూ నమ్మించి ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని తీసుకెళ్లాడు. పిఠాపురం శివారు ప్రాంతంలోకి వెళ్లాక పక్కకు తీసుకెళ్లి కర్రతో దాడి చేసి ఆ వ్యక్తి నుంచి రూ.10 వేలు లాక్కుని పరారయ్యాడు.

సీసీ కెమెరాలున్నా గుర్తించలేకపోతున్నారా?

పిఠాపురంలో రద్దీగా ఉండే ఉప్పాడ బస్టాండ్ సెంటర్, కోటగుమ్మం సెంటర్, చర్చి సెంటర్, సినిమా సెంటర్ తదితర ప్రాంతాల్లో రోజూ చోరీలు జరుగుతున్నాయి. మోటారు సైకిళ్లపై వస్తున్న ఆగంతకులు నడిచి వెళుతున్న వారి చేతుల్లో ఫోన్లు లాక్కుని పరారవుతున్నారు. పిఠాపురంలో వరుసగా చోటుచేసుకుంటున్న దొంగతనాలపై బాధితులు పోలీసులను ఆశ్రయించినా ఫలితం ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనేక కేసుల్లో బాధితులు ఫిర్యాదు చేస్తున్నా పోలీసులు కేసులు మాత్రం నమోదు చేయడం లేదని తెలుస్తుంది. పట్టణంలో సీసీ కెమెరాలున్నా దొంగలను ఎందుకు పట్టుకోలేకపోతున్నారన్న చర్చ సాగుతుంది. పోలీసుల నిఘా కొరవడడం వల్లే దొంగతనాలు పెరిగిపోయాయని బాధితులు వాపోతున్నారు. పట్టణంలో నిత్యం వినిపిస్తున్న దొంగతనాల వార్తలతో స్థానికులే కాకుండా పట్టణానికి నిత్యం ఏదో పనులతో వచ్చేవారు సైతం వణికిపోతున్నారు.

ప్రజలు పట్టుకుంటే దొంగలు రారు

ఇటీవలి కాలంలో చోరీలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన సెంటర్లలో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశాం. పట్టణంలో సీసీ కెమెరాల వీడియో పుటేజీ ఆధారంగా ఇప్పటికే కొందరు దొంగలను పట్టుకున్నాం. విచారణ జరుగుతున్నందున వివరాలు బయటపెట్టలేం. పోలీసులు అన్ని సమయాల్లో అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువ. అందుకే మన కళ్ల ముందు ఎవరైనా దొంగతనం చేసి పారిపోతుంటే మనకెందుకులే అని వదిలేయకుండా స్పందించాలి. ప్రజలు అలా ఒకరిద్దరిని పట్టుకుంటే దొంగలు ఇక్కడకు రావడానికే భయపడతారు. ప్రజలు సహకరిస్తే ఎటువంటి దొంగతనాలు లేకుండా చేయడానికి వీలు కలుగుతుంది.

– శ్రీనివాస్, సీఐ, పిఠాపురం

సమస్యల పరిష్కారానికే పీజీఆర్ఎస్

- పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు
- గ్రీవెన్స్‌కు తొమ్మిది అర్జీలు



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు



మండల స్థాయిలో అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారాని కోసం ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్‌ఖ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. వారం వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి పది అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. మండల స్థాయిలో అధికారులకు అప్పగించామన్నారు. ఈ వారం నిర్వహించిన కార్యక్రమానికి మూడు అంశాలపై తొమ్మిది ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించడం జరిగిందని ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్, డిటీ భానుకుమార్, చప్పిడి రాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల స్థాయిలో

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్) నిర్వహించారు. పీజీఆర్ఎస్ ప్రత్యేకాధికారి కో–ఆపరేటివ్ అడిట్ ఆఫీసర్ మురళీకుమార్, ఎంపీడీఓ ఎం.ఉషారాణి మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. చదలాడ గ్రామానికి చెందిన వ్యక్తి రేషన్ కార్డు కావాలని, వాలుతిమ్మాపురంలో అపారిశుద్ధ్యంపై తదితర సమస్యలపై అర్జీలు అందాయన్నారు. ఈ కార్యకమంలో వెలుగు ఏపీఎం సూర్యన్నారాయణ, వ్యవసాయాధికారి సంజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అప్పలరాజు, ఇరిగేషన్ ఏఈ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



వేట్లపాలెంలో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎంఈఓ–2 పుల్లయ్య

సామర్లకోట: వేట్లపాలెం జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. వీటిని ఎంఈఓ–2 పి.పుల్లయ్య విద్యార్థులకు అందజేశారు. పట్టణ, మండల పరిధిలోని అన్ని పాఠశాలలోను సోమవారం విద్యార్థులకు అందించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం ఎమ్మెల్యే రాజప్ప కిట్స్ పంపిణీని ప్రారంభించారు. దాంతో ఆయా పాఠశాలల పరిధిలోని ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కిట్లు అందజేశారు. కొన్ని పాఠశాలల్లో దాతలు ముందుకు వచ్చి పెరుగు, స్వీట్లు అందజేశారు. స్థానిక బచ్చు పౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన జరిగి జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ బలుసు వాసు, విద్యాకమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: స్థానికంగా జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. కార్యక్రమంలో గుండ్రా అప్పారావు, చింతలపూడి వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి ప్రాణాన్ని కాపాడేందుకు రక్తదానం దోహదం



రక్తదానం చేస్తున్న యువత

పెద్దాపురం: ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాన్ని కాపాడేందుకు రక్తదాన శిబిరాలు దోహదపడతాయని సాయి సేవా గ్రూప్ సభ్యులు అద్దేపల్లి రమేష్, అత్తెం రమేష్ అన్నారు. స్థానిక తాళ్లూరి వారి సత్రంలో సోమవారం సాయి సేవా గ్రూపు, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వ్యక్తి రక్తం అవసరమైనప్పుడు బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తం అందించే వీలుందన్నారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేస్తే కొన్ని ప్రాణాలను కాపాడే అవకాశం ఉందన్నారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 130 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాయి సేవా గ్రూప్ సభ్యులు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న 1985-86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పిఠాపురం: స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1985–86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 95 మంది పూర్వ విద్యార్థులంతా దాదాపు 38 ఏళ్ల తరువాత పిఠాపురంలోని రామా ఫంక్షన్ హాల్‌లో కలుసుకుని అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా విద్యా దాత పిఠాపురం మహారాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థులంతా తాము జీవితంలో ఎంత బిజీగా ఉన్నా ఏటా ఇలాగే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవాలని, ఎవరికి కష్టమొచ్చినా సమష్టిగా ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు.

చిన్నారులకు మొక్కల పంపిణీ



చిన్నారులకు మొక్కలు అందజేసిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: చిన్నతనం నుంచి మొక్కల వల్ల లభించే ఫలితాలకు వివరించాలని శ్రీభీమేశ్వరా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్ఆర్‌వైఆర్‌కె ప్రసాద్ తెలిపారు. ఆయన స్థానిక కొత్తూరులోని ప్రతిభా విద్యానికేతన్‌లో చిన్నారులకు జామ, ఉసిరి. గొరింట, వెలగ మొక్కలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి బడుగు బాబి, లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధులు కర్రి ఆదినారాయణరెడ్డి, మేకా శ్రీనివాసు, ఎస్‌వీవీజీ ప్రకాష్, శేఖర్‌లు కొత్తూరు రోడ్డులో మొక్కలు నాటారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు పర్యవేక్షణ ఉండాలి

కరప: పాఠశాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్న పిల్లలపై తల్లి దండ్రులు పర్యవేక్షణ ఉండాలని గ్రామసర్పంచ్ సాదే ఆశాజ్యోతి పేర్కొన్నారు. పిల్లల చదువుతోపాటు, అలవాట్లు, స్నేహాలు, వారిప్రవర్తన ఎలా ఉన్నది ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉండాలన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రవేశపెట్టిన శిక్షా సప్తాహ కార్యక్రమ వారోత్సవాల్లో భాగంగా చివరిరోజు సామాజిక భాగస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిదండ్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం పిల్లలకు స్వీట్లు అందించారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఇన్‌ఛార్జ్ హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, స్టాఫ్‌సెక్రటరీ ఎం.శ్రీరామచంద్రమూర్తి, పీడీ కె.శ్రీనివాస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నతపాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని హెచ్ఎం ఎ.సాయిమోహన ఆధ్వర్యంలో నిర్వహించారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్యకుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భకులు కిటకిటలాడారు. స్వామి వారికి తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారికి పిఠాపురం మహారాజా గోత్రనామాలతో జరిగే తొలి అభిషేకం, పూజలను తిలకించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. పెద్ద నంది మూల విరాట్‌తో పాటు ఉప ఆలయాలను, స్వామివారిని అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో అర్చకులు వేమూరి సోమేశ్వర శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అల్లకి రాజ్ గోపాల్, చెరుకూరి రాంబాబులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేశారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని అప్పగించండి

- శిథిలమైన భవనాలను కూల్చి వేయాలి
- ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు



వేట్లపాలెంలో శిథిల స్థితిలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్

సామర్లకోట: ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్న భవనాన్ని ఖాళీ చేసి మండల పరిషత్‌కు అప్పగించాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు డిమాండ్ చేశారు. భయం భయంగా.. అనే శీర్షికతో సాక్షి సోమవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. పూర్వపు సమితి కార్యాలయంలో ఉండే మండల పరిషత్ కార్యాలయం శిథిలస్థితికి చేరుకోవడంతో ఆవరణలో ఖాళీగా ఉన్న భవనంలో జిల్లా పరిషత్ నిధులతో నూతన భవనం నిర్మించామన్నారు. అయితే ఖాళీగా శిథిలమైన పాత ఎంపీడీఓ కార్యాలయంలోనికి 2016లో తహసీల్దార్ కార్యాలయం మార్పు చేశారని, అయితే ఆ భవనం ఎప్పుడైనా కూలిపోయేస్థితిలో ఉందని అన్నారు. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో ఎవరికైనా ప్రమాదం జరిగితే దానికి తమ శాఖను బాధ్యులను చేస్తారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తమ శాఖకు చెందిన తహసీల్దార్ కార్యాలయాన్ని వెంటనే ఖాళీ చేసి తమ శాఖకు అప్పగించాలన్నారు. అలాగే వేట్లపాలెం గ్రామంలోని కొండపల్లి గంగన్న మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్ శిథిలస్థితికి చేరుకున్న భవనాలను కూడా కూల్చివేయాలన్న విషయాన్ని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఎంపీపీ సత్తిబాబు ఆరోపించారు. దీనిపై ఎంఈఓ 2 పి. పుల్లయ్యను వివరణ కొరగా శిథిలమైన తరగతి గదులను మూసి వేయాలని ఆదేశాలు ఇస్తామని చెప్పారు.

ఘనంగా మజుందార్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేతలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో చారు మజుందార్ 52వ వర్ధంతి సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మజుందార్ చిత్రపటానికి సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాకర రత్నకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు నక్క అప్పన్న, తగెళ్ల మహాలక్ష్మి, కన్నడ రమణ, నక్క మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

సామర్లకోట: వీకే రాయపురం సర్పంచ్ మోర్త పూర్ణిమ కుటుంబ సభ్యులను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించి తన సంతాపం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన సర్పంచ్ చికిత్స పొందుతూ శనివారం కాకినాడ ఆస్పత్రిలో మృతి చెందిన విషయం విధితమే. ఈ మేరకు సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. గ్రామ ఉపసర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుర్రా నారాయణస్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కూచిపూడి పోటీల్లో ప్రతిభ కనబరిచిన పెద్దాపురం విద్యార్థులు

పెద్దాపురం: ఈ నెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు తిరుపతి మహితి ఆడిటోరియంలో జరిగిన రాష్ట్ర స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో పెద్దాపురం భావయామి ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఆర్ట్స్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చారు. ఈ మేరకు నాట్య గురువులు చక్రవర్తుల పవన్‌కుమార్, పురాణం సృజన, రవిచంద్రికలు సోమవారం స్థానిక విలేకర్లలకు ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిది రోజుల పాటు జరిగిన పోటీల్లో 1500 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను పలువురు అభినందించారు.